
శరావతి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు

● అనుమతులు ఇవ్వరాదని చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డన్ నివేదిక

అనుమానమే..?

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): ఏటా విద్యుత్ ఉత్పత్తికంటే వాడకం గణనీయంగా పెరుగుతోంది. విద్యుత్ ఆధారితం లేకుంటే ఏ పరిశ్రమ నడిచే పరిస్థితి లేదు. పైగా విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగేందుకు పలు కారణాలు ఉన్నాయి. ఇంట్లో ప్రతి వస్తువు పనిచేయాలన్నా కరెంటు తప్పనిసరి. తాజాగా నాలుగైదేళ్లలో ఎలక్ట్రికల్ వాహనాల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. డిమాండ్‌కు తగినట్టుగా విద్యుత్ ఉత్పత్తిలో భారీగా తేడాలు ఉన్నాయి. ఇటీవల సోలార్ ప్రాజెక్టులు మినహా జలవిద్యుత్ ప్రాజెక్టులు పెరగలేదు. రాయచూరు జిల్లాలో అత్యధికంగా థర్మల్ పవర్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ తర్వాత జల విద్యుత్ ప్రాజెక్టులు రెండేళ్లుగా బాగా పనిచేస్తున్నాయి.


శరావతి డ్యామ్ (ఫైల్)

అందుకు కారణం రెండేళ్లుగా వర్షాలు బాగా కురవడంతో విద్యుత్ ఉత్పత్తి సంతృప్తికరంగా ఉంది. ఇక ఉత్తరకన్నడ జిల్లా కైగా ప్రాంతంలో అణువిద్యుత్ కేంద్రం కొనసాగుతోంది. తాజాగా సోలార్ ప్రాజెక్టులు పెరుగుతున్నా డిమాండ్‌కు ఆదుకునే రీతిలో లేవు. దీంతో ప్రభుత్వం జలవిద్యుత్ ప్రాజెక్టులను పెంచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇలా శివమొగ్గ జిల్లాలో శరావతి నదికి అనుబంధంగా నిర్మించతలపెట్టిన ప్రాజెక్టుకు నిరంతరం గండాలు ఎదురవుతున్నాయి.

● శివమొగ్గ జిల్లాలో శరావతి పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు (పీఎస్‌హెచ్‌పీ) స్థల పరిశీలన నివేదిక విడుదలైంది. ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వరాదని సిఫారసు చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. స్పష్టమైన నివేదిక అనంతరం కూడా అటవీశాఖ డిప్యూటీ జనరల్ స్థల పరిశీలన నివేదికను కాకుండా వన్యజీవి పరిపాలనా విభాగానికి సంబంధించిన ఆధారంగా సిఫారసు చేయడం వివాదమవుతోంది. ప్రాజెక్టు అమలు చేయాలని భావిస్తున్న తరుణంలో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖకు చీఫ్‌వైల్డ్‌లైఫ్ వార్డెన్ నివేదిక ఆధారంగా సిఫారసు చేయరాదని కోరడం వివాదానికి కారణమవుతోంది. ఫారెస్టు విభాగం డీఐజీ స్థలపరిశీలన చేసి సమగ్ర నివేదిక సమర్పించారు. ప్రధానంగా శరావతి అభయారణ్య పరిధిలో అటవీప్రాంతం ఎంత ఉపయోగించుకోవాలి, వన్యప్రాణులు, అడవి నాశనం, ప్రకృతిపై జరిగే నష్టాలను నివేదిక రూపొందించారు.

● పశ్చిమ కనుమల పరిధిలోని శరావతి అభయారణ్యంలో 10,240 కోట్ల రూపాయలతో 54.15 హెక్టార్ల ప్రాంతంలో 2వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన లక్ష్యంగా ప్రాజెక్టును రూపొందించదలిచారు. ప్రారంభం నుంచి మలెనాడు ప్రజలు వ్యతిరేకిస్తూ వచ్చారు. ప్రభుత్వం మొండిగా ప్రాజెక్టును అమలు చేసేందుకు నిర్ణయించింది. 2017లో ఈ ప్రాజెక్టును 4వేల కోట్ల రూపాయలుగా నిర్ధారించారు. 2024 నాటికి 8,500 కోట్ల రూపాయలకు చేరింది. ఈ ఏడాది ఇటీవల రూపొందించిన డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) ప్రకారం రూ.10,240 కోట్లుగా అంచనా వేశారు. డీపీఆర్‌లో లాభం ప్రస్తావన మినహా ఇతరత్రా అంశాలను పరిగణించలేదు. ఇవే వ్యతిరేకతకు కారణాలు అవుతున్నాయి.

నివేదిక మేరకు కీలక సిఫారసులు

శరావతి పంప్ ప్రాజెక్ట్ ప్రదేశం పశ్చిమకనుమలకు అనుబంధంగా ఉండడంతో 15వేలకుపైగా చెట్లను తొలగించాల్సి ఉంది. తద్వారా పర్యావరణానికి భంగం ఏర్పడనుంది. అడవి పరిధిలోని వన్యప్రాణుల జీవనం కష్టతరం కానుంది. సమగ్రంగా ఉండే పర్యావరణ వ్యవస్థను నాశనం చేస్తే పునరుద్ధరించడం అసాధ్యం. కొత్త రోడ్లు వేయడం, రోడ్ల వెడల్పుకు చెట్లు నాశనం కానున్నాయి. కొన్ని బండలు, పేలుడు పదార్థాల ద్వారా తొలగించాల్సి ఉంటుంది. తద్వారా భూమి కుంచించుకుపోయే ప్రమాదం ఉంది. శరావతి పంప్‌స్టోరేజ్ నిర్మించదలిచిన ప్రదేశంలో రెండు జలాశయాలు ఉన్నాయి. 9 మీటర్ల వెడల్పు, 3.2 కిలోమీటర్ల పొడవు, 500 మీటర్ల లోతు దాకా పేలుళ్లు జరపాల్సి ఉంటుంది. ఈ ప్రాంతంలో నివసించేవారికి హానికరం కానుంది. శరావతి అభయారణ్యం పరిధిలో పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఉత్తరకన్నడ జిల్లా శరావతి నది పరిధిలో కేపీసీఎల్‌కు ఇప్పటికే 18వేల హెక్టార్ల అటవీప్రాదేశాన్ని లీజుకు ఇచ్చారు. ఈ ప్రాజెక్టు అమలు చేస్తే సింహాలతోపాటు వన్యప్రాణుల సంతతికి ముప్పు వాటిల్లనుంది. విద్యుత్ ఉత్పాదన కేంద్రానికి సంబంధించి మాత్రమే డీపీఆర్‌లో పొందుపరిచారు. కానీ ప్రాజెక్టు తర్వాత అభయారణ్య పరిధిలో విద్యుత్ సరఫరాకు సంబంధించి అవసరమైన స్థలాన్ని ప్రస్తావించలేదు. ప్రత్యేకంగా విద్యుత్‌లైన్ల ఏర్పాటుకు మరిన్ని చెట్లు తొలగించాల్సి ఉంటుంది. పైగా అటవీప్రాంతంలో నుంచే సుదూరంగా విద్యుత్‌లైన్లకోసం స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇలా అడవులకు, వన్యప్రాణులకు భం గం కలిగించే శరావతి ప్రాజెక్టు వదులుకోవడం సముచితమని చీఫ్‌వైల్డ్‌లైఫ్ వార్డెన్ నివేదిక సమర్పించారు. రాష్ట్రప్రభుత్వ ఆలోచనలకు భిన్నంగా నివేదిక ఉండడంతో సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది.


ఫిలించాంబర్ వద్ద కన్నడ సంఘాల నాయకుల నిరసన

కమల్ హాసన్‌కు కన్నడ చరిత్ర తెలియదు: సీఎం

● థగ్‌లైఫ్ సినిమాను రిలీజ్ చేయకండి: కన్నడసంఘాలు

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తమిళభాష నుంచి కన్నడ పుట్టిందంటూ తమిళనటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. థగ్‌లైఫ్ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ కోసం బెంగళూరులో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమల్‌హాసన్ కన్నడభాష పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బుధవారం విధానసౌధలో సీఎం సిద్దరామయ్య స్పందిస్తూ కమల్‌హాసన్‌కు కన్నడ భాష గురించి ఏం తెలుసని ఎద్దేవా చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత అశోక్ తదితరులు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కమల్‌హాసన్ వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. కమల్ మంచి నటుడు కావచ్చని, అయినంత మాత్రాన నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదన్నారు. కమల్‌హాసన్ నటించిన థగ్‌లైఫ్ సినిమాను కర్ణాటకలో విడుదల చేయరాదని కన్నడ సంఘాలు పిలుపునిచ్చాయి. కన్నడ భాషపట్ల అనుచితంగా మాట్లాడిన వ్యక్తి సినిమా అవసరం లేదన్నారు. నగరంలో పలు చోట్ల కర్ణాటక రక్షణావేదిక (కరవే) నారాయణగౌడ, ప్రవీణ్‌శెట్టి, వివిధ వర్గాలు వేర్వేరుగా నిరసనలు తెలిపాయి. ఫిలించాంబర్ వద్ద కన్నడ అభిమానులు ఆందోళన చేశారు. నటుడు, ఎంపీ జగ్గేశ్ బెంగళూరులో స్పందిస్తూ కళలకు కులం, భాష లేదని అందుకే కమల్‌హాసన్‌ను అభిమానించామని, కానీ కన్నడభాషను తక్కువ చేసి మాట్లాడితే సహించేది లేదన్నారు. కన్నడకు 2,500 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. నటుడు చేతన్ మాట్లాడుతూ కన్నడకంటే తమిళం ప్రాచీనం కావచ్చని, అయితే తమిళం నుంచి కన్నడ పుట్టలేదన్నారు. రెండు భాషలకు ద్రవిడం మూలమైనా తమిళభాషలో పుట్టిందనేది సమంజసం కాదన్నారు.

అనర్హులకు గృహలక్ష్మి, గృహజ్యోతి రద్దు


బసవరాజరాయరెడ్డి

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారెంటీ ల్లో కీలకమైన గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాల అనర్హులైన లబ్ధిదారులకు జూలై నుంచి రద్దు చేస్తున్నట్లు సీఎం ఆర్థిక సలహాదారు బసవరాజరాయరెడ్డి తెలిపారు. కొప్పళ జిల్లా కుకనూరు పట్టణ అతిథిగృహంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. గ్యారెంటీ పథకాల్లో అనర్హులైన లబ్ధిదారులకు లాభం కలుగుతోందన్నారు. సర్వేలు జరిపి అనర్హులను తొలగించదలిచామన్నారు. ఒక శాసనసభ నియోజకవర్గానికి ఏడాదికి గ్యారెంటీ పథకాల ద్వారా రూ.250 కోట్లు చేరుతోందన్నారు. పథకం ప్రజల చెంతకు వెళ్తోందని, అయితే అనర్హులు సైతం లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాలుగా అధికారులను ఏర్పాటు చేసి నియంత్రించాలని సీఎం సిద్దరామయ్యకు వివరిస్తానన్నారు. ఇళ్లు బాడుగకు ఇచ్చినవారికి గృహజ్యోతి వర్తిస్తోందన్నారు. గృహలక్ష్మి పథకం జీఎస్టీ, ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లించేవారికి వెళ్తుందోన్నారు. సమగ్రంగా సర్వే జరిపి అర్హులకు మాత్రమే గ్యారెంటీలు అందాల్సిన అవసరం ఉందన్నారు.

రేపటి నుంచి ఇండియా ఎంఎస్‌ఎంఈ సదస్సు


సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షుడు తదితరులు

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌కేసీసీఐ), కాసియా, పీణ్యా ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు దక్షిణభారతస్థాయి అతిపెద్ద ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఎఫ్‌కేసీసీఐ అధ్యక్షుడు ఎంజీ బాలకృష్ణ, కాసియా అధ్యక్షుడు ఎంజీ రాజగోపాల్, పీణ్యా ఇండస్ట్రీస్ అధ్యక్షుడు శివకుమార్ బుధవారం మీడియాతో మాట్లాడారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పబ్లిక్‌సెక్టార్, పెద్దకంపెనీలతో అనుసంధానం చేసేందుకు వేదిక ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేక్ ఇన్ ఇండియా పరికల్పన ఆధారంగా స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎఫ్‌కేసీసీఐలో 3వేలమంది సభ్యులు ఉన్నారన్నారు. కాసియా 12వేలకుపైగా ఎంఎస్‌ఎంఈలను 127 సంఘాల సహకారంతో పనిచేస్తోందన్నారు. పీణ్యాలో 3,700కుపైగా పరిశ్రమలు ఉన్నాయన్నారు. సంయుక్తంగా ఏర్పాటు చేయడం ద్వారా చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించదలిచామన్నారు. రైల్వేరంగానికి ఎంఎస్‌ఎంఈకి అనుకూలమయ్యేలా ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్యాలెస్ గ్రౌండ్స్ త్రిపురవాసినిలో జరిగే కార్యక్రమంలో 250కుపైగా స్టాల్స్ బీ2బీ సభలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలతోపాటు వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు భాగస్వాములు అవుతారన్నారు.

అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ప్రభుత్వం ఆదేశాలు

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో 11వేలమంది అతిథి ఉపాధ్యాయులను నియమించుకునేలా రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 2025-26 విద్యాసంవత్సరంలో విద్యార్థుల బోధనలకు అనుకూలంగా ఉండాలనే అతిథి ఉపాధ్యాయులను (గెస్ట్ టీచర్) నియమించుకునేలా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. వారికి తాత్కాలిక పద్ధతిన గౌరవ వేతనం అందిస్తారు. హైస్కూల్‌లో ఖాళీగా ఉండే 9,499 పోస్టులను భర్తీ చేయదలిచారు. తాలూకాలవారీగా ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి ఎంపికలను హెడ్మాస్టర్ ద్వారానే అమలు చేయదలిచారు. కర్ణాటక పబ్లిక్‌స్కూల్, బెంగళూరు పబ్లిక్‌స్కూల్, ఆదర్శ విద్యాలయలలో ఖాళీగా ఉన్న పోస్టులను గెస్ట్ రూపంలోనే భర్తీ చేయదలిచారు. రెగ్యులర్ నియామకాలు జరిపి పోస్టింగ్‌లు కేటాయిస్తే అటువంటి ప్రదేశంలో పనిచేసే గెస్ట్ టీచర్‌లకు తాలూకా పరిధిలోనే మరో చోటుకు బదిలీ చేస్తామని అధికారులు తెలిపారు. ఎక్కువమంది విద్యార్థులు ఉండే పాఠశాలలకు అనుకూలంగా నియామకాలు జరుపుతున్నట్టు తెలిపారు.

ధర తగ్గిన ఉల్లి


పొలం వద్దనే ఉల్లి బస్తాలు

చేళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): తాలూకా పరిధిలో ఉల్లికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం 60 కేజీల బస్తా రూ.500 పలుకుతోంది. గతంలో గరిష్ఠంగా రూ.3వేలు ఉండేది. కొంతకాలంగా ఉల్లి ఎగుమతి లేకపోవడంతో ధర పడిపోయిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటుధర కోసం ఎదురుచూస్తున్నామని, కోతకు వచ్చిన ఉల్లిని కోసి బస్తాలలో సిద్ధంగా ఉంచినట్టు తెలిపారు.


రహీం మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తున్న దృశ్యం

రహీం హత్యను ఖండిస్తూ భారీ ర్యాలీ

● మూకుమ్మడి రాజీనామాకు సిద్ధమైన కాంగ్రెస్ నాయకులు

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా ఇసుక రవాణా పేరిట పిలిపించి ఇద్దరిపై వేటకొడవళ్లతో దాడిచేసిన సంఘటనలో ఇరాకోడిలో అబ్దుల్ రహీం మృతిచెందగా ఖలందర్ షఫి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఘటనపై పోస్టుమార్టం ప్రక్రియ పూర్తికాగా బుధవారం మధ్యాహ్నం రహీం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అంతిమయాత్రకు వేలాదిమంది తరలివచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దక్షిణకన్నడ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు షాహుల్ హమీద్ సహా ఇతర నాయకులంతా మూకుమ్మడిగా రాజీనామా చేయాలని నిర్ధారించారు. అందుకోసమే గురువారం మధ్యాహ్నం ప్రత్యేక సమావేశానికి పిలుపునిచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశమై ఒక నిర్ణయం తీసుకోదలిచారు. దక్షిణ కన్నడ జిల్లాలో వరుసగా హత్యలు జరుగుతున్నాయని ఎంతమందిని కోల్పోవాలని మండిపడ్డారు. ఈమేరకు అంతిమయాత్రలో పాల్గొన్నవారు పోలీసులు, ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టారు. మంగళూరు షాదిమహల్‌లో జరిగే కార్యక్రమంలో కీలక నిర్ణయం తీసుకోదలిచారు. మైనారిటీ విభాగం తీసుకున్న నిర్ణయంతో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నేతలకు కొత్త సమస్య వచ్చినట్టయ్యింది. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ అందుబాటులో లేరు. ఆయన మక్కాయాత్రకు వెళ్లారు. దీంతో సీనియర్ నేతలు సమస్యను ఏ విధంగా పరిష్కరించాలనే కోణంలో తర్జనభర్జన పడుతున్నారు. కాగా నిందితులు ఎంతటివారైనా వదిలేది లేదని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దినేశ్‌గుండూరావు ప్రకటించారు. దక్షిణకన్నడ జిల్లాలో చోటు చేసుకున్న పరిణామాలపై సీఎం సిద్దరామయ్య జిల్లా ఉన్నతాధికారులతో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా అంతిమయాత్ర వేళ వేలాది మందిని నియంత్రించడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఓ ప్రైవేట్ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు అప్రమత్తమై అంతిమయాత్ర జరిగే ప్రాంతాలలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కాగా మహ్మద్‌నిస్సార్ ఫిర్యాదు మేరకు దీపక్, సుమిత్‌లతోపాటు 15మందిపై కేసు నమోదు చేశారు.



టౌన్‌హాల్‌లో పాల్గొన్న ప్రముఖులు


సీఎం, డీసీఎంలతోపాటు కాంగ్రెస్ నాయకుల సెల్యూట్


జాతీయ పతాకాలతో మాజీ సైనికులు

సైనికుల సాహసాలతోనే మనం సురక్షితం

● 'జైహింద్' సభలో సీఎం

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): ఎండా, వానా, చలి తేడా లేకుండా సరిహద్దుల్లో సైనికుల సాహసాలతోనే మనం సురక్షితంగా ఉన్నామని సీఎం సిద్దరామయ్య అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన జైహింద్ సభకు డీసీఎం డీకే శివకుమార్, కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలా, మాజీ సైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ సమాజంలో సైనికులు, రైతులు, డాక్టర్లు, ఉపాధ్యాయులను తల్లిదండ్రుల తరహాలనే స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. త్యాగం మనోభావాలనుంచే సైనికులు దేశాన్ని రక్షిస్తున్నారన్నారు. కాగా మిలిటరీ క్యాంటీన్‌లకు ఎక్సైజ్ సుంకం విధించేది లేదని సీఎం ప్రకటించారు. మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇదే సమావేశంలో డీసీఎం మాట్లాడుతూ మాజీ సైనికుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ఆలోచన ఉందన్నారు. సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ సైనిక విభాగం అధ్యక్షుడు మల్లికార్జున ప్రతిపాదించిన పలు అంశాలను పరిష్కరిస్తామన్నారు. మాజీ సైనిక అధికారులు, అమరులైన సైనిక కుటుంబాలకు ఇదే వేదికపై సన్మానించారు. విద్యార్థులతోపాటు కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకావిష్కరణ


వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ బుక్ చూస్తున్న అచ్చెన్నాయుడు


వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి


రక్తదానం చేసిన వారికి షీల్డు అందిస్తున్న దృశ్యం


మహానాడులో ప్రత్యేక ఆకర్షణ ఎన్టీఆర్ వేషధారి..







పసుపు జాతర

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.




మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి సైకిళ్లపై వచ్చిన కార్యకర్తలు






నోరూరించే వంటలు రెడీ...


మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ


అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు


మేము విజిలేస్తే...


కార్యకర్తల ఉత్సాహం..


రక్తదానం చేస్తున్న కార్యకర్తలు


పోలీసు తనిఖీలు

కిడ్నాపా..? అరెస్టా..?

దుమారం రేపుతున్న 'రత్నాకరం' భూ వివాదాలు

ఎనిమిది రోజులుగా కనిపించని సత్యనారాయణ రాజు

ప్రైవేటు వ్యక్తులు.. పోలీసుల అదుపులో సెటిల్‌మెంట్లు..?

పుట్టపర్తి, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన గోకులం రత్నాకరం సత్యనారాయణరాజు అనే రియల్టర్ 'కిడ్నాప్' వ్యవహారం కలకలం రేపుతోంది. భూ వివాదాలు, బినామీ వ్యవహారాల నేపథ్యంలో ఎనిమిది రోజులుగా కొందరు ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు సత్యనారాయణ రాజును అదుపులో ఉంచుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తున్నారు. 'పోలీస్ స్టేషన్‌కు వెళితే పట్టించుకోవడం లేదు. ఫిర్యాదును స్వీకరించడం లేదు. మా అన్న ఏమయ్యాడో తెలియడం లేదు' అని సత్యనారాయణ సోదరుడు ఆంధ్రజ్యోతిని బుధవారం రాత్రి ఆశ్రయించారు. సత్యనారాయణరాజు పేరు మీద పుట్టపర్తిలో కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని సమాచారం. ఆ భూములపై కన్నేసిన పుట్టపర్తికి చెందిన కొందరు ఈ నెల 20న కిడ్నాప్ చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సత్యనారాయణరాజు బుధవారం తన తల్లికి ఫోన్ చేసి, తన పేరిట ఉన్న విలువైన భూమిని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని విలపించినట్లు తెలిసింది. పది రోజులుగా తన కుమారుడు కనిపించడం లేదని, కాపాడాలని కుటుంబ బుధవారం సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పోలీసులే ఈ నెల 20న దగ్గరుండి తీసుకెళ్లారని వారు ఆరోపిస్తున్నారు. సత్యనారాయణ రాజును చూపించాలని పోలీసులను అడిగితే పొంతనలేని సమాధానలు చెబుతున్నారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చిత్రహింసలు..?

ఏదైనా కేసులో నిందితుడిగా సత్యనారాయణ రాజును పోలీసులు అదుపులోకి తీసుకుంటే 24 గంటల్లోగా కోర్టు ఎదుట హాజరుపరచాలి. దర్యాప్తు కోసం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకోవచ్చు. ఇవేవీ కాదనుకుంటే కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించి ఏమయ్యాడో కనిపెట్టాలి. కానీ ఎనిమిది రోజులు అవుతున్నా ఈ వ్యవహారంలో నోరు మెదపడం లేదు. కుటుంబ సభ్యులు చెబుతున్న వివరాల ప్రకారం సత్యనారాయణరాజు అదృశ్యం వెనుక కొందరు పోలీసులతోపాటు ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం కనిపిస్తోంది. అతన్ని చిత్రహింసలు పెట్టి ఆస్తులు రాయించుకున్నారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

బినామీ వ్యవహారాలు కూడా..

పుట్టపర్తికి వచ్చే బాబా భక్తుల్లో కొందరు విదేశీయులకు సత్యనారాయణ రాజు బినామీగా ఉన్నాడని ప్రచారం జరుగుతోంది. వారి తరఫున పుట్టపర్తిలో భూములు కొనుగోలు చేశాడని, అవి రూ.కోట్లు పలుకుతుండటంతో తిరిగి అప్పగించకుండా సత్యనారాయణరాజు ఎదురు తిరిగాడని అంటున్నారు. బినామీ వ్యవహారాలు చట్ట వ్యతిరేకం కావడంతో సెటిల్‌మెంట్‌ల దిశగా వ్యవహారాలు నడిపిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కిడ్నాప్, బెదిరింపులు, చిత్రహింసలు, బలవంతపు రిజిస్ట్రేషన్‌లు వంటి ఆరోపణలు వస్తున్నాయి. ఈ తతంగంలో పోలీసు శాఖకు మరకలు అంటుతున్నాయి.


విజయ్‌కుమార్, డీఎస్పీ

మా వద్దే ఉన్నాడు..

పోలీసులు ఈ నెల 20న సత్యనారాయణరాజు ను విచారణ పేరుతో తీసుకువెళ్లినట్లు సమాచారం. కానీ ఇన్ని రోజులుగా అరెస్టు చూపకపోవడం విమర్శలకు, అనుమానాలకు తావిస్తోంది. సత్యనారాయ రాజును అరెస్టు చేశా రా..? కిడ్నాప్ అయ్యారా..? అని పుట్టపర్తి డీ ఎస్పీ విజయకుమార్‌ను వివరణ కోరగా, తమ అదుపులో ఉన్నాడని బుధవారం రాత్రి తెలిపారు. అమెరికాకు చెందిన అరవిన్ ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సత్యనారాయణరాజును బినామీగా పెట్టుకుని అరవిన్ పుట్టపర్తిలో భూములు కొనుగోలు చేశారని తెలిపారు. విదేశాల నుంచి రూ.8.5 కోట్ల లావాదేవీలు సత్యనారాయణరాజు ఖాతా నుంచి జరిగాయని తెలిపారు. అందుకే సత్యనారాయణరాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. అమెరికా, జర్మనీకి చెందిన మరో ఇద్దరు కూడా సత్యనారాయణ రాజుపై ఫిర్యాదు చేశారని, ఆ దిశగా విచారణ చేపట్టామని తెలిపారు. సత్యనారాయణ రాజును ఎవరూ కిడ్నాప్ చేయలేదని అన్నారు.

ఖాళీలు చూపాలంటూ ఆందోళన

● **డీఈఓ డౌన్.. డౌన్.. అంటూ బాధిత టీచర్ల నినాదాలు**

అనంతపురం విద్య, మే 28(ఆంధ్రజ్యోతి): స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ ప్రమోషన్ల కోసం ఖాళీలు 233 చూపాలని బాధిత టీచర్లు, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం శారదా స్కూల్‌లోని బదిలీల కేంద్రం వద్ద 2023లో ఆగిన ప్రమోషన్ల ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ బాధిత టీచర్లు, పలు సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఒక వైపు వెబెక్స్ జరుగుతుండగా... మరోవైపు ఆందోళనకారులు ధర్నా చేశారు. 'డీఈఓ డౌన్ డౌన్..' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. అరగంటపాటు నేలపై కూర్చుని, నిరసన తెలిపారు. తర్వాత బాధిత టీచర్లు, సంఘాల నాయకులు మాట్లాడుతూ... గతంలో ఇంగ్లిష్ స్కూ ల్ అసిస్టెంట్ ప్రమోషన్లకు 230 పోస్టులు చూపిన వారు... ఇప్పుడు 19 మాత్రమే చూపుతుండటం దారుణం అన్నారు. 2025 డీఎస్సీలో రిక్రూట్‌మెంట్‌కు 103 పోస్టులు చూపిన అధికారులు ప్రమోషన్లకు 233 పోస్టులు చూపాల్సి ఉందన్నారు. 70 శాతం ప్రమోషన్ల పోస్టులు ఎక్కడికెళ్లాయని ప్రశ్నించారు. ఈ మేరకు డీఈఓ ప్రసాద్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సమస్యలను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు సూర్యుడు, జయరాంనాయక్, చంద్రశేఖర్, శ్రీనివాస నాయక్, సిరాజుద్దీన్, గోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, సుధాకర్, శంకరమూర్తి, నాగిరెడ్డి, కేశవరెడ్డి, ఓబులేసు, లక్ష్మీనారాయణ, ధనలక్ష్మి, విజయశ్రీ, నరసింహులు, ఓబిరెడ్డి, సూర్యనారాయణ, రసూల్ పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్ర పరికరాలు..!

● సబ్సిడీ యంత్రాల్లో కంపెనీల మాయాజాలం
● ధరలు పెంచేసిన వైనం
● మార్కెట్ ధరల కన్నా అధికం
● రాయితీ ఇచ్చినా ప్రయోజనం లేదంటున్న రైతులు
● పరికరాలకు స్పందన అంతంతే..

“ రోటావేటర్ ధరను ప్రభుత్వం రూ.80 వేల నుంచి రూ.1.50లక్షల వరకు మార్గదర్శకాల్లో పేర్కొంది. దీనిపై రైతుకు రూ.50 వేల వరకు సబ్సిడీ వర్తిస్తుంది. రాయితీ పోనూ రైతు చెల్లించే మొత్తం కలుపుకుంటే ఈ ధర బయట మార్కెట్ కన్నా రూ.30 వేలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు సబ్సిడీ వచ్చినా.. చెల్లించే మొత్తం దాదాపు బయటి ధరకు సమానంగా ఉంటున్నట్లు తెలుస్తోంది.

“ ట్రాక్టర్ కల్టివేటర్ ధరను రూ.43 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో సబ్సిడి పోనూ రైతు రూ.21 వేలకు చెల్లించాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్లో వీటిని తూకం బట్టి ఇస్తారనీ, ఇది అంత ధర ఉండదనేది రైతుల అభిప్రాయం.

“ బ్యాటరీ స్ప్రేయర్ ప్రభుత్వ ధర రూ.26 వేలు ఉండగా.. రూ.10వేలు సబ్సిడీ పోనూ రైతులు రూ.16 వేలు డీడీ ద్వారా జమ చేయాలి. ఇదే బహిరంగ మార్కెట్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.5వేల వరకు తక్కువగా ఉంటుందని అంటున్నారు. దీనిని ఎక్కువగా చూపించి కంపెనీలు రైతులకు దగా చేస్తున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



మార్కెట్‌లో కంటే ఎక్కువగా ధరలు



రోటావేటరకు దరఖాస్తు చేసుకున్నా. ధర బయట మార్కెట్‌లో కంటే ఎక్కువగా ఉంది. ధరలపై కంపెనీలతో ప్రభుత్వం చర్చించి, బయట మార్కెట్ కంటే తక్కువకు ఇస్తే బాగుంటుంది.
-ప్రకాష్, రైతు, హరేసముద్రం

బొమ్మనహాళ్, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీపై అందించే వ్యవసాయ యంత్ర పరికరాల ధరల్లో కంపెనీలు మాయాజాలం ప్రదర్శిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్సిడీకి అనుగుణంగా ధరలు పెంచేసి దగా చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. సబ్సిడీపోనూ రైతు చెల్లించే ధర.. బయటి మార్కెట్ రేటుకు దాదాపు సమానంగా ఉంటున్నట్లు వారు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రయోజనం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈనేపథ్యంలో వ్యవసాయ యంత్ర పరికరాలు తీసుకునేందుకు ఆసక్తి చూపట్లేదు. వెరసి.. నిర్దేశిత లక్ష్యం అధిగమించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. పదేపదే గడువు పొడిగిస్తున్నా.. రైతులు ఆసక్తి చూపట్లేదు. పరికరాల ధరలపై కంపెనీలతో ప్రభుత్వం చర్చించి, తమకు న్యాయం చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

పదేపదే పొడిగించినా..

పంటల సాగులో కూలీల ఖర్చు తగ్గించేందుకు రైతులకు యాంత్రీకరణ పరికరాలను ప్రభుత్వం అందజేస్తోంది. ఐదెకరాల కన్నా తక్కువ ఉన్న రైతులకు వాటిని ప్రభుత్వం అందజేస్తుంది. సాధారణంగా సబ్సిడీ పరికరాల కోసం రైతాంగం నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు రావాల్సి ఉంది. అనూహ్యంగా ఈసారి స్పందన అంతంతమాత్రంగానే ఉంది. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికే అధికారులు తంటాలు పడుతున్నారు. బొమ్మనహాళ్ మండలానికి 23 పరికరాలు మంజూరయ్యాయి. 12 స్ప్రేయర్లు, 2 రోటావేటర్లు, 5 బ్యాటరీ స్ప్రేయర్లు, 4 ట్రాక్టర్లు రైతులు తీసుకున్నారు. తొలిసారి మంజూరు చేసిన వాటిని మాత్రం తీసుకున్నారు. తర్వాత ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. వ్యవసాయ పరికరం ధరను బట్టి ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు సబ్సిడీ వర్తింపజేస్తుంది. ఇక్కడే సదరు యంత్రాలను సరఫరా చేసే కంపెనీలు మాయాజాలం చేస్తున్నట్లు తెలుస్తోంది. సబ్సిడీ మొత్తం పోనూ రైతు చెల్లించే ధర కలుపుకుంటే బయట మార్కెట్ కన్నా ఎక్కువగా ఉందని రైతులు అంటున్నారు. వాస్తవానికి ఇది ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడమే. బ్రాండెడ్, గ్యారెంటీల ముసుగుతో కొటేషన్లు ఎక్కువగా ఇచ్చి కంపెనీల డీలర్లు దోచుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ ధరలు బేరీజు వేసుకున్న రైతాంగం సబ్సిడీ యంత్ర పరికరాలపై ఆసక్తి చూపట్లేదు. మండలాల వారీగా అధికారులకు లక్ష్యాలు ఇచ్చి, వాటిని పూర్తి చేయాలని మెడ మీద కత్తిపెట్టి వ్యవసాయ శాఖ పనిచేయించింది. మార్చి ఆఖరుకే గడువు విధించారు. రైతుల నుంచి పెద్దగా స్పందన లేకపోవడంతో ప్రభుత్వం గడువు పొడిగించుకుంటూ వచ్చింది. ఈనెల మొదటి వారంలో దరఖాస్తుల ప్రక్రియను వ్యవసాయశాఖ నిలిపివేసింది. సబ్సిడీ కోసం ఎగబడాల్సిన రైతులు దానిని కాదనుకునేలా వ్యవహరించడం వెనుక ఉన్న కారణాలపై దృష్టి పెట్టే పని వ్యవసాయ శాఖ చేయలేదు. సబ్సిడీపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవస్థల వైఫల్యం కూడా ప్రస్తుత పరిస్థితికి కారణంగా ఉంది. అన్నదాతల దగ్గర డబ్బు లేకపోవడం కూడా ఇందుకు కారణమనే వాదన ఉంది.

ధరలు ఎక్కువగా ఉన్నాయి



వ్యవసాయ యంత్ర పరికరాల ధరలు ఎక్కువగా ఉన్నాయి. స్ప్రేయర్ ధర బయట మార్కెట్ కంటే ఎక్కువగా ఉంది. నాణ్యత ఏ మాత్రం ఉన్నాయో తెలియడం లేదు.
- నిరంజన్, రైతు, బొమ్మనహాళ్


కేంద్రహోంశాఖ సహాయమంత్రిని కలిసిన మంత్రి సత్యకుమార్ యాదవ్

ఆర్డీటీకి సహకరించండి

కేంద్రమంత్రిని కోరిన రాష్ట్ర మంత్రి సత్యకుమార్

ధర్మవరం, మే 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఆర్డీటీకి కేంద్రం సహకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కోరినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మం త్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేంద్రమంత్రిని బుధవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి, రాష్ట్రాభివృద్ధికి అవసరమైన కీలక అంశాలపై చర్చించారు. ఈక్రమంలోనే అనంతపురం జిల్లా కేంద్రంగా 55 ఏళ్ల పాటు విశేష సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ ఆర్డీటీ గురించి ప్రస్తావించినట్లు మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఈ సంస్థకు సంబంధించి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో సంప్రదించి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు మంత్రి సత్యకుమార్‌యాదవ్ వెల్లడించారు.

మద్యం మత్తులో భార్యను పొడిచిన భర్త

గుమ్మఘట్ట, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావి గ్రామంలో బుధవారం రాత్రి మద్యం మత్తులో దళిత సాల్మాన్ తన భార్య శాంతమ్మ(38)ను కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. అడ్డు పడిన 14 ఏళ్ల క్రాంతిని సైతం కత్తితో గాయపరిచాడు. గత కొంత కాలంగా మద్యం సేవించి కుటుంబ పోషణను పట్టించుకోకపోవడంతో కుటుంబసభ్యులు మందలించారు. దీంతో భార్య భర్తల మధ్య తగాదాలు పెరిగి సాల్మాన్ భార్య శాంతమ్మపై ఇంట్లో ఉన్న కత్తితో పొడిచి గాయపరిచాడు. వెంటనే ఇరుగుపొరుగువారు సమీప బంధువులు గాయపడిన శాంతమ్మ, కూతురు క్రాంతిని చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


చికిత్స పొందుతున్న శాంతమ్మ

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

బాబ్ హోప్ (జయంతి)



లెస్లీ టౌన్స్ బాబ్ హోప్ 1903 మే 29న జన్మించారు. బ్రిటీష్-అమెరికన్ అయిన ఆయన కమెడియన్‌గా, నటుడిగా, గాయకుడిగా, డ్యాన్సర్‌గా, అథ్లెట్, రచయితగా రాణించి బహుముఖ ప్రజ్ఞాశాలి అనిపించుకున్నారు. 70కుపైగా షార్ట్, ఫీచర్ ఫిల్మ్‌లో నటించారు. 19సార్లు అకాడమీ పురస్కారాల కార్యక్రమాలకు హోస్ట్‌గా వ్యవహరించారు. 'థ్యాంక్స్ ఫర్ ది మెమరీ' అనేది ఆయన సిగ్నేచర్ ట్యూన్‌గా ఉండేది. 1997లో యూఎస్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌చే గౌరవ వ్యక్తిగా నిలిచారు. అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ నుంచి ఐదుసార్లు గౌరవ పురస్కారాలు అందుకున్నారు. వందో యేట 2003 జూలై 27న కన్నుమూశారు.

టెన్సింగ్ నార్కే(జయంతి)



'పద్మ భూషణ్ గ్రహీత టెన్సింగ్ నార్కే 1914 మే 29న జన్మించారు. అసలు పేరు 'నామ్‌గైల్ వాంగ్డీ'. నేపాలీ భారతీయుడు. పర్వతారోహకుడు. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన తొలి ఇద్దరిలో ఒకరు. ఎడ్మండ్ హిల్లరీతో కలసి హిమాలయాలలోని శిఖరాన్ని 1953 మే 29న అధిరోహించిన ద్వయం చరిత్రలో నిలిచారు. టైమ్ మ్యాగజైన్ ప్రచురించిన 20వ శతాబ్దపు ప్రాచుర్యం పొందిన వంద మందిలో ఒకరు. 'ఆర్డర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ నేపాల్, క్వీన్ ఎలిజబెత్ 2 కరోనేషన్ మెడల్ ఇతర పురస్కారాలు పొందారు. 1986 మే 9న కన్నుమూశారు.

అంబరీశ్ (జయంతి)




శాండల్‌వుడ్‌లో 'రెబెల్ స్టార్'గా, 'మండ్యద గండు'గా పేరొందిన అంబరీశ్ 1952 మే 29న కర్ణాటక రాష్ట్రం మండ్య జిల్లా దొడ్డ రసనకెరె గ్రామంలో జన్మించారు. అసలు పేరు మళవళ్ళి హుచ్చే గౌడ అమరనాథ్. కన్నడ సినీరంగంతోపాటు రాజకీయాల్లోనూ తనదైన ముద్రను చాటుకున్నారు. ప్రముఖ దర్శకుడు పుట్టణ్ణ కనగాళ్ నిర్మించిన 'నాగరహావు'తో అరంగేట్రం చేయగా ఈ సినిమాకు జాతీయ అవార్డు లభించింది. ప్రతినాయకుడిగా, నాయకుడిగా సత్తా చాటుకుని ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, విష్ణువర్ధన్ అవార్డు, గౌరవ డాక్టరేట్ సహా పలు అవార్డులు అందుకున్నారు. మూడుసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు. 2018 నవంబరు 24న కన్నుమూశారు.

నండూరి వెంకటసుబ్బారావు (వర్ధంతి)



ప్రసిద్ధ రచయిత నండూరి వెంకటసుబ్బారావు 1895 డిసెంబరు 16న పశ్చిమగోదావరి జిల్లా వసంతవాడ గ్రామంలో జన్మించారు. ఆయన రచించిన 'ఎంకి పాటలు' గేయ సంపుటి ఎంతో గుర్తింపు పొందింది. ప్రణయభావుకతకు, పదాల పొందికకూ కొత్త అందాలు సమకూర్చిన రచనను ఎంకి పాటల గాలి దుమారంగా తెలుగు సాహితీకారులు అభివర్ణిస్తారు. రేడియో నాటికల సంకలనం 'చిత్రనళినీయం' ఎంతో గుర్తింపు పొందింది. 1957 మే 29న కన్నుమూశారు.

పంకజ్ కపూర్ (పుట్టినరోజు)



పంకజ్ కపూర్ 1952 మే 29న పంజాబ్‌లో జన్మించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా నుంచి పట్టా అందుకున్నాక హిందీలో నాటక, బుల్లితెర, సినీ రంగానికి ఎన్నో సేవలందించారు. దూరదర్శన్‌లో 1980, 90 దశకాలలో డిటెక్టివ్ తరహా కరమ్ చంద్, అవినీతిపై పోరాటం చేసే సున్నితహాస్యం కల్గిన 'ఆఫీస్ ఆఫీస్' వంటి సిరీస్ తో సత్తా చాటుకున్నారు. 3 జాతీయ అవార్డులు, ఫిల్మ్‌ఫేర్, స్క్రీన్ అవార్డులు, ఇండియన్ టెల్లీ అవార్డులు పొందారు. ఆయన కుమారుడు షాహిద్ కపూర్ కూడా నటుడిగా ఉన్నారు.

సైనికులకు మద్దతుగా ర్యాలీ



జాతీయపతాకాలతో నినాదాలు ఇలా..

దొమ్మసంద్ర, మే 28 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై ఆనేకల్ పట్టణంలో భారత సైనికులకు మద్దతుగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. జాతీయ పతాకాలతో ఊరేగారు. ప్రధాన రహదారి సహా ఇతర ప్రాంతాల్లోనూ ర్యాలీగా సాగారు. భారత్‌మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఆర్మీకి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. రామానుజాచార్య మఠం నుంచి బాలగంగాధర్ తిలక్ కూడలి మీదుగా దేవంగాపేట, సంగొళ్ళి రాయణ్ణ రోడ్డు, దేవరకొండప్ప సర్కిల్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ అమర జవాన్ శక్తి కేంద్రానికి చేరుకుంది. గురూజీ యతిరాజఅయ్యంగార్ మాట్లాడుతూ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిలో పలువురు మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. దీన్ని ఖండిస్తూ బుద్ధి చెప్పేలా భారతసైన్యం దీటుగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందన్నారు. సైనికుల దేశభక్తి ఇతరులలో స్ఫూర్తి నింపాలన్నారు. ఆనేకల్ ధర్మస్థళ క్షేమాభివృద్ధి సంఘం సభ్యులు దివ్య, సంకీర్తన బృందం యతీశ్వరి, రామప్రియాంబ, నళినాక్షి, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కన్నడ భవన్ ప్రారంభం



కన్నడ భవన్ ప్రారంభోత్సవంలో మంత్రి సుధాకర్ తదితరులు

చిక్కబళ్ళాపుర, మే 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పాలనాయంత్రాంగం, జిల్లా పంచాయతీ, కన్నడ సాంస్కృతికశాఖ సహకారంతో జిల్లా కేంద్రమైన చిక్కబళ్ళాపురలో రూ.17.83 కోట్లతో కన్నడభవన్‌ను ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ వేల సంవత్సరాల చరిత్ర కల్గిన కన్నడభాషకు ప్రపంచంలో 6500 భాషలు ఉండగా 27వ స్థానంలో నిలిచిందన్నారు. మన భాషా సంస్కృతులను భావితరాలకు పదిలంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. నిడుమామిడి మఠానికి చెందిన డాక్టర్ జచని, విద్యావేత్త డాక్టర్ హెచ్ ఎస్ నరసింహయ్య, ప్రముఖ దర్శకుడు టీఎస్ సీతారాం, సీరియర్ కవి బీఆర్ లక్ష్మణ్‌రావ్ వంటివారు జిల్లాకు పేరు తెచ్చారన్నారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ వీరప్పమొయిలీ మాట్లాడుతూ కన్నడ భాష, సాహిత్యంలో చిక్కబళ్ళాపుర జిల్లాకు తనదైన ప్రత్యేకత ఉందన్నారు. జిల్లాలో ఎందరో కవులు పుట్టారన్నారు. తరచూ సాహిత్య సదస్సులు నిర్వహించి సమకాలీన సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామీజీ మాట్లాడుతూ కన్నడిగులు కన్నడ భాషపట్ల అభిమానం చూపాలని భాష మనుగడకోసం తమవంతు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, గౌరిబిదనూరు ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ, కర్ణాటక జానపద అకాడమీ చైర్మన్ గొల్లహళ్ళి శివప్రసాద్, స్థానిక ప్రముఖులు శివశంకర్‌రెడ్డి, జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర, జడ్పీ సీఈఓ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత బీఆర్ అంబేడ్కర్ భవన్ నుంచి వివిధ జానపద, సాంస్కృతిక బృందాలతో ఊరేగింపు జరిగింది.

మానవత్వానికి అద్దంపట్టేలా భానుముస్తాక్ రచనలు

సీఎం మీడియా సలహాదారు ప్రభాకర్



భానుముస్తాక్‌ను సత్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

బెంగళూరు, మే28(ఆంధ్రజ్యోతి): మానవత్వానికి అద్దం పట్టేలా భానుముస్తాక్ రచనలు సాగించారని ముఖ్యమంత్రి మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయస్థాయి బుకర్ ప్రైజ్ లభించిన మేరకు కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. గాంధీభవన్‌లో భానుముస్తాక్‌ను ప్రత్యేకంగా సత్కరించారు. సాహిత్యం పేరిట ఒకేవైపు రచనలు, వాదనలు చేసేవారికి భాను ముస్తాక్‌కు దక్కిన పురస్కారం చెంపపెట్టు లాంటిదన్నారు. మానవత్వమే మతమని, అన్ని మతాలలోనూ మానవత్వం కల్గిన వ్యక్తులు ఉన్నారన్నారు. భానుముస్తాక్ కంటే ఎక్కువ రచనలు చేసినవారు ఉన్నారని, కానీ మానవత్వం కోణమే ఇక్కడ బహుసుందరమని నిరూపించిందన్నారు. భాను ముస్తాక్ రచనలు వాస్తవికతకు అద్దం పట్టేలా ఉన్నాయన్నారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శివానంద తగడూరు, మీడియా అకాడమీ చైర్మన్ ఆయేషా ఖానం, జీఎన్ మోహన్, పద్మ శివమొగ్గ, చెన్నేగౌడ, హెచ్‌సీ దినేశ్‌లు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం



విజయోత్సవంలో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తదితరులు

బంగారపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో బంగారపేట కాంగ్రెస్ అభ్యర్థి రంగాచారి గెలుపొందడంపై విజయోత్సవం నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎన్ రిసార్ట్‌లో బుధవారం ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ డీసీసీ బ్యాంకు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మార్కండయ్య గౌడ విజయం కోసం మాలూరు ఎమ్మెల్యే నంజేగౌడ ఎంతో ప్రయత్నించారని అయితే సాధ్యం కాలేదన్నారు. డైరెక్టర్ పదవికి పోటీ చేయగా 12 ఓట్లకుగాను 8 ఓట్లు దక్కాయన్నారు. కాంగ్రెస్‌లో మెజారిటీ, మైనారిటీ అనే బేధభావాలు లేవని పార్టీకోసం క్రమశిక్షణతో కృషి చేసేవారికి ఉన్నత హోదాలు లభిస్తాయన్నారు. డీసీసీ బ్యాంకలో ఒక సంవత్సరకాలంగా పాలకవర్గం లేకపోవడంతో కొన్ని సమస్యలు ఉండేవన్నారు. ప్రస్తుతం కొత్తపాలకవర్గం రావడంతో రైతులు, మహిళలకు వడ్డీ రహిత రుణాలు సులభతరం కానున్నాయన్నారు. రంగాచారి విజయం కోసం పార్టీ డెలిగేట్స్, జిల్లాకాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, బంగారపేట నగర బ్లాక్ అధ్యక్షుడు చందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్‌ర్యాంకు విద్యార్థికి సన్మానం



సమన్విత, ఆమె తల్లిదండ్రులకు సత్కారం

శిడ్లఘట్ట, మే 28(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాలలో రాష్ట్రస్థాయి నాల్గోర్యాంకు సాధించడంతో లక్ష్మీ విద్యానికేతన్ పాఠశాల పాలకవర్గం ఆధ్వర్యంలో సమన్వితను ఆమె తల్లిదండ్రులను బుధవారం ఆత్మీయంగా సత్కరించారు. తాలూకాలోని చిక్కదాసరహళ్ళి గ్రామం సమీపంలోని లక్ష్మీ విద్యానికేతన్ పాఠశాలలో చిక్కదాసరహళ్ళి గ్రామానికి చెందిన మూర్తి, వనజాక్షి కుమార్తె సమన్విత 625 మార్కులకుగాను 622 మార్కులు సాధించారు. విద్యార్థి సాధనతో పాఠశాలకు, తాలూకాకు కీర్తి దక్కిందని పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పాఠశాల ఫౌండర్ దేవరాజ్ మాట్లాడుతూ 30మంది విద్యార్థులకుగాను 17మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమన్విత విజయవంతో పాఠశాలకు గౌరవం పెరిగిందన్నారు. ర్యాంకులు సాధించడం అంత సులభం కాదని ఎంతోకష్టం ఉందని, విద్యార్థిని ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ప్రశంసించారు. సమన్విత మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి ఎస్ఎస్ఎల్‌సీ వరకు ఇక్కడే చదివానని, ఉపాధ్యాయుల ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. తనకు డాక్టర్ కావాలనేది లక్ష్యమన్నారు. తాలూకా పంచాయతీ మాజీ సభ్యుడు అరికెరె మునిరాజు, బసవాపట్ట నాగేంద్ర, నరసింహప్ప, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పౌరకార్మికులకు నియామక పత్రాల పంపిణీ



నియామకపత్రాలు అందచేస్తున్న అధికారులు

విజయనగర్, మే 28(ఆంధ్రజ్యోతి): బీబీఎంపీ పౌరకార్మికులకు పర్మనెంట్ చేస్తూ ఆదేశించిన నియామకపత్రాలను విడతలవారీగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మైసూరురోడ్డులోని బీబీఎంపీ కార్యాలయంలో మంగళ, బుధ వారాలలో నియామకపత్రాలు అందచేశారు. చామరాజపేట అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హెల్త్), బీబీఎంపీ సహాయక కార్యనిర్వాహక అధికారి సంగీత ఇతర అధికారులు పాల్గొన్నారు.

నగరంలో మళ్లీ టోయింగ్



టోయింగ్‌లో వాహనాల తరలింపు (ఫైల్)

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ట్రాఫిక్ సమస్య తీవ్రమైనందున రెండేళ్లుగా నిలిపివేసిన టోయింగ్ విధానాన్ని మళ్ళీ ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన ఉన్నతాధికారులతో సమావేశం తర్వాత హోం మంత్రి పరమేశ్వర్ నిర్ణయం తీసుకున్నారు. నగరంలో 19 ప్రాంతాలలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఉందన్నారు. పోలీసు, బీబీఎంపీ సమన్వయంగా పనిచేయదలిచినట్లు తెలిపారు. టోయింగ్ ద్వారా రోడ్లపై ఇష్టానుసారంగా ఆపి ఉండే వాహనాలను తొలగించాలన్నదే ఆశయమన్నారు.

మంటలు వ్యాపించి కూలిన ఇల్లు

ఆదుకోవాలని బాధితుల వినతి



కూలిపోయిన పెంకుటిల్లు

బంగారపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): దీపంవల్ల మంటలు ఇల్లు అంతా వ్యాపించి నిత్యావసరాలు సహా కాలిపోయి కాలిపోయిన సంఘటన కామసముద్ర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాకారహళ్ళి గ్రామంలో చోటు చేసుకుంది. తాలూకాలోని కేతగానహళ్ళి పంచాయతీ పరిధిలోని మాకారహళ్ళిలో కూలి పని చేసుకుని జీవనం సాగించే మూగవ్యక్తి కేశవమూర్తి కుటుంబం పెంకుటిల్లులో ఉంటోంది. రాత్రి గ్రామంలో పవర్‌కట్ నేపథ్యంలో దీపం వెలిగించి అలాగే నిద్రించారు. దీపం మంటలు ఒక్కసారిగా ఇంటిమొత్తం వ్యాపించాయి. లక్ష రూపాయలకుపైగా విలువైన సామగ్రి కాలిపోయింది. మంటలు ఆర్పివేయడానికి అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నించారు. కాగా ప్రమాదంలో కేశవమూర్తి, వృద్ధులైన తల్లిదండ్రులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరారు.

రక్తహీనత మహిళకు కాన్పు

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): గర్భిణీ మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటేనే ప్రసవం సులభతరం కానుందని ప్రముఖ గైనకాలజిస్ట్ నిషా బూచాడే అభిప్రాయపడ్డారు. ఇటీవల వాసవి ఆసుపత్రిలో రక్తహీనత మహిళకు కాన్పు విధానంపై ఆమె మంగళవారం మీడియాతో మాట్లాడారు. తొలికాన్పులో రక్తహీనతతో నెలరోజులు ఆసుపత్రిలో గడిపిన ఆమె రెండో కాన్పులోనూ అదే సమస్య ఎదుర్కొన్నారన్నారు. సికెల్‌సెల్ ఎనీమియాగా పిలిచే రక్తహీనత జబ్బుతో బాధపడుతున్న ఆమెకు సిజేరియన్ తర్వాత కొన్ని రోజులు వాసవి ఆసుపత్రిలోనే ఉంచామన్నారు. ప్రస్తుతం తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. గర్భం ధరించే వేళ ఆరోగ్యంపట్ల మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పోషికాహారంతోపాటు కనీస వ్యాయామం పాటించాలని తద్వారా బిడ్డకు మంచిదన్నారు.

ప్రభుత్వాస్పత్రి అప్‌గ్రేడ్‌కు నిధుల మంజూరు

సిరుగుప్ప, మే 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిని అప్‌గ్రేడ్ చేసేందుకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య రక్షణ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వంద పడకల ప్రభుత్వాస్పత్రిని 150 పడకల ఆస్పత్రిగా నిర్మాణ పనులు చేసేందుకు రూ.16.50 కోట్లు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. టెక్కలకోట ప్రభుత్వాస్పత్రిని 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు రూ.పది కోట్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే పాత ప్రభుత్వాస్పత్రిని పగులగొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. జిల్లా ఆరోగ్య సంక్షేమ శాఖ వైద్యాధికారి డాక్టర్ రమేష్ బాబు, తాలుకా వైద్యాధికారి బసవరాజ, చీఫ్ వైద్యులు డాక్టర్ వివేకానంద, ఆరోగ్య రక్షణ సమితి సభ్యులు మోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

తీరప్రాంతంలో రెడ్ అలర్ట్

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో మూడురోజులు తీవ్రమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది. ప్రధానంగా తీరప్రాంత జిల్లాలైన ఉత్తరకన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాలను రెడ్ అలర్ట్‌గా ప్రకటించారు. మంగళూరు, మూడబిదరి, ధర్మస్థళ, పుత్తూరు, సుళ్య, ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. బెళగావి, కొడగు, శివమొగ్గ, చిక్కమగళూరు, బీదర్, కలబురగి జిల్లాలను ఆరెంజ్ అలర్ట్‌గా ప్రకటించారు. మిగిలిన జిల్లాల్లోనూ వర్షాలు నమోదవుతాయని సురక్షిత ప్రాంతాల్లో ప్రజలు ఉండాలని, పాతబడిన ఇళ్లల్లో నివసించరాదని సూచించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న మేరకు సీఎం సిద్దరామయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు దిశానిర్దేశం చేశారు. వెంటనే జిల్లా కేంద్రాలకు వెళ్లాలని ఆదేశించారు. అక్కడే మకాం వేసి సహాయక చర్యలు కొనసాగించాలని సూచించారు. జిల్లాధికారులు, సీఈఓలతో ప్రత్యేక సమావేశం జరిపేందుకు సీఎం సిద్ధమయ్యారు.

తెలుగువారి ఆత్మగౌరవం ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్



ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

బెంగళూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన ఘటన ఎన్టీరామారావుకే దక్కుతుందని తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షులు రాధాకృష్ణరాజు అభిప్రాయపడ్డారు. ఎన్టీఆర్ జయంతిని బుధవారం సమితి ప్రాంగణంలో జరిపారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలుచల్లి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌వీ హరీశ్, ఉమాపతి నాయుడు, నరసింహమూర్తి, ఆదికేశవులునాయుడు, శేఖర్ రాజు, గంగరాజు, లక్ష్మీరెడ్డి, వరదరాజు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ సాధనలను వివరించారు. ఎన్టీఆర్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు.

చదువుపట్ల అంకితభావం పెంచుకోవాలి

రామకృష్ణమఠం తద్యుక్తానంద స్వామిజీ



జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో స్వామీజీ తదితరులు

బెంగళూరు, మే 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపట్ల అంకితభావం పెంచుకోవాలని అప్పుడే శ్రద్ధ, నైపుణ్యత సాధ్యమవుతుందని రామకృష్ణమఠం తద్యుక్తానంద స్వామిజీ అభిప్రాయపడ్డారు. శ్రీకృష్ణ గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 8వ తరగతి ఐసీఎస్ఈ తరగతులను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. స్వామిజీ మాట్లాడుతూ మీ గమ్యానికి మీరే సృష్టికర్తలని భావించాలన్నారు. జీవితకాలం సంతోషంగా ఉండాలంటే ఉత్తమ విద్య, నైతిక విలువలు కీలకమన్నారు. కొత్త అంశాన్ని నేర్చుకోవడమే ఆశయంగా భావించాలన్నారు. శారదాదేవి పిల్లలందరినీ సొంత బిడ్డల్లా భావిస్తుందని మీరు కూడా కృప పొందాలని ఆశించారు. సంస్థ చైర్మన్ రుక్మాంగదనాయుడు, సురేంద్రతోపాటు పలువురు పాల్గొన్నారు.

శనైశ్చర ఆలయంలో విశేష పూజలు



స్వామివారికి విశేష అలంకరణ

ముళబాగిలు, మే 28(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ఖాద్రి పుర సర్కిల్‌లో కొలువైన శనైశ్చర స్వామి దేవాలయంలో శనైశ్చర జయంతిని పురస్కరించుకుని మంగళవారం విశేషపూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ సంస్థాపక అధ్యక్షుడు పీ సుదర్శన్ దీక్షిత్ నేతృత్వంలో సంప్రదాయాల ప్రకారం కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, తైలాభిషేకం, నవగ్రహ పూజ, దేవతలకు విశేషపుష్పాలంకరణ చేశారు. తాలూకా సహా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఎంసీ సుభాష్ చంద్రగౌడ, వీ మారప్ప ప్రాయోజకత్వం వహించారు.

కమల్‌హాసన్ వ్యాఖ్యలు అభ్యంతరకరం



ఆందోళన చేస్తున్న కన్నడ అభిమానులు

రాయచూరు, మే 28 (ఆంధ్రజ్యోతి): చైన్నైలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో కన్నడ భాష పట్ల సీనియర్ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని రాజ్‌కుమార్ అభిమాని సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు, ఎయిమ్స్ సమితి కన్వీనర్ బసవరాజ కళస అన్నారు. ఆయన నటించిన చిత్రాలను జిల్లాలోనే కాదు రాష్ట్రంలో ఎక్కడా ప్రదర్శించకుండా నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలను నిరసిస్తూ కన్నడ సంఘాలు, భాషాభిమానుల ఆధ్వర్యంలో బుధవారం నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1590.76	1,577.42
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,574	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	131	0
నీటి నిల్వ (టీఎంసీలు)	11.68	3.35

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తోరణగల్లు, మే 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్‌లో ఉన్న మార్కండేయస్వామి ఆలయ 15వ వార్షికోత్సవాన్ని నేకార సమాజ బాంధవులు ఘనంగా జరుపుకున్నారు. స్వామివారికి వివిధ ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి శివ మార్కాండేయస్వామి వారిని సీతారాములను, వినాయక స్వామిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. ప్రసాదం అందించడం జరిగింది. భక్తాదులు స్వామివారిని దర్శించుకున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



క్లాక్‌టవర్ పనులను పరిశీలిస్తున్న సిటీ ఎమ్మెల్యే

బళ్లారిరూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాయల్ సర్కిల్ క్లాక్ టవర్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఉదయం ఎమ్మెల్యే భరత్ రెడ్డి పరిశీలించారు. కాంట్రాక్టర్లకు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం రాయల్ సర్కిల్ నుంచి ఇంద్ర సర్కిల్ వరకు పలు అభివృద్ధి పరిశీలించి అధికారులకు పనులు వీలైనంత త్వరలో పూర్తి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఈఈ హేమరాజ్, ఏఈఈ సుదర్శన్ రెడ్డి, మహానగరపాలికె ఈఈ గోవర్ధన్, కమిషనర్ పాల్గొన్నారు.

జాతరలో జోరుగా వ్యాపారం



గాజుల అంగడిలో మహిళల సందడి

కంప్లి, మే 28(ఆంధ్రజ్యోతి): అమ్మవారి జాతరలో గాజుల వ్యాపారం పుష్కలంగా అయ్యిందని వ్యాపారులు తెలిపారు. కూడ్లిగి పట్టణంలో ఊరమ్మ జాతర సందర్భంగా పది రోజుల పాటు వ్యాపారాలు బాగా జరిగాయని వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. యేడాది కాలంలోనే వర్షాలు కురవడంతోనూ 15 సంవత్సరాలకు ఒకసారి జాతర జరగడంతో పట్టణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు భారీ ఎత్తున తరలిరావడంతో వ్యాపారాలు మంచిగా జరిగాయని అంటున్నారు. 20 నుంచి 27వ తేదీ వరకు వ్యాపారాలు రద్దీగానే ఉన్నాయని తెలిపారు.

ఆహార కిట్ల పంపిణీ



రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఈశ్వర్ సావది

కంప్లి, మే 28(ఆంధ్రజ్యోతి): గంగావతి సబ్ డివిజనల్ ఆస్పత్రిలోని హెచ్ఐవీ శాఖ గదిలో బుధవారం జిల్లా క్షయ నిర్మూలన కేంద్రం, గంగావతి రోటరీ క్లబ్ ఆఫ్ రైస్ బౌల్ సహోగ్‌లో క్షయ రోగులకు ఆహార కిట్లను పంపిణీ చేశారు. ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఈశ్వర సావది మాట్లాడుతూ నవజాత శిశువులు, తల్లిదండ్రులకు ఆహారం ఇవ్వడానికి ఇష్టపడకపోగా రోటరీ సంస్థ క్షయ రోగులకు ఆహారకిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ సంస్థ మాదిరిగానే ప్రతి ఒక సంస్థ ముందుకు వచ్చి పేదలను ఆదుకునేందుకు ముందుకు రావాలని సూచించారు. రోటరీ క్లబ్ ఆఫ్ రైస్‌బౌల్ అధ్యక్షురాలు గీతాచౌదరి సాయినగర్, కార్యదర్శి భారతి ఆగలూరు, కమ్యూనిటీ అధినేత బసమ్మ, హనవాల ఆరోగ్యశాఖ, క్షయ విభాగం మల్లికార్జున, హుస్సేన్ బాషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోండి



ఇందిరా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, మే 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల నుంచి కంప్లి పట్టణానికి వచ్చే ప్రజలు ఇందిరా క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణేష్ కోరారు. బుధవారం కంప్లి పాత బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన ఇందిరా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాల కోసం ఇందిరా క్యాంటీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం ఉపాహారం రూ5, మధ్యాహ్న భోజనం రూ.10, రాత్రి భోజనం రూ.10కి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇదే పాత బస్టాండ్‌లో రూ.కోటితో మినీ బస్టాండు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పురసభ అధ్యక్షుడు బట్ట ప్రసాద్, ఉపాధ్యక్షురాలు సుశీలమ్మ స్థాయి సమితి అధ్యక్షులు ఉస్మాన్, దుర్గన్న, కౌన్సిలర్లు వీరాంజనేయులు, చాంద్ బాషా మౌలా సీఆర్ హనుమంతు, మౌనేష్, విరుపాక్షి, మూకయ్యస్వామి, సిద్దప్ప పాల్గొన్నారు.



అన్నదాన కేంద్రంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ట్రస్టు సభ్యులు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అరిస్తున్న కమ్మ సామాజికవర్గీయులు

ఘనంగా ఎన్టీఆర్ జయంతి

బళ్లారి రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): ఏపీ దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 102వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని బళ్లారి ట్రోమా కేర్ ఆస్పత్రి ఆవరణలో నందమూరి తారక రామారావు అన్నప్రసాద సేవా ట్రస్టు ఆధ్వర్యంలో హాస్పిటల్ ఆవరణలో రోగులు, వారి బంధువులకు అన్నదానం చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు అధ్యక్షుడు లాల్‌మోహన్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఫౌండర్, ప్రెసిడెంట్ దుర్గా



వృద్ధాశ్రమంలో కేక్ కట్‌చేస్తున్న కళ్యాణ్‌రామ్ అభిమాన సంఘం సభ్యులు

ఫణీంద్ర పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కేంద్రం దాదాపుగా 288 రోజులు రోగుల బంధువులకు ప్రతిరోజు అన్నదానం చేస్తున్నారు. సెక్రటరీ గుర్రం మోహన్‌దాస్, సిమ్లా ప్రకాష్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బళ్లారి కమ్మ సంఘం ఆధ్వర్యంలో కమ్మభవన్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కమ్మ కుల బాంధవులు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సేవలు మరువలేమని ఆయన తెలుగువాడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఒక దేవుడయ్యాడన్నారు. వైస్ ప్రెసిడెంట్ ముల్లంగి చంద్రశేఖర చౌదరి, సెక్రటరీ దామోదర్ చౌదరి, కమిటీ సభ్యులు కందిబేళ్ల ఉమామహేశ్వర్, మారుతి రమేష్ పుల్లయ్య, మాజీ మేయర్ రాజేశ్వరి, అలివేలు సురేష్, సుబ్బరాయుడు, కమ్మ కులబాంధవులు పాల్గొన్నారు.

కళ్యాణ్‌రామ్, నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నిర్వహించారు. మదర్ థెరిస్సా ఆశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఉలగప్ప, సందీప్, అడివప్ప, మంజునాథ్, నాగరాజు పాల్గొన్నారు.

లారీల వేగాన్ని నియంత్రించాలి: డీఎస్పీ

బళ్లారి సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): ట్రక్ డ్రైవర్లు మానవత్వాన్ని మరచి రాక్షసులలా డ్రైవింగ్ చేస్తూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని, 14రోజుల్లో ఖనిజ ట్రక్కుల స్పీడ్ కంట్రోలర్లను అమర్చాలని తోరణగల్లు డివిజన్ డిప్యూటీ ఎస్పీ ప్రసాద్ గోఖలే హెచ్చరించారు. సండూర్‌పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రవాణా, ఆటవీశాఖ, మైనింగ్ కంపెనీ యజమానులు ట్రాకింగ్ సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన ప్రమాద నియంత్రణ అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు అందరూ యూనిఫాం ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ట్రక్కులకు హెచ్ఎస్ఆర్‌పీ నంబర్ ప్లేట్లు అమర్చాలని, వేగ పరిమితిన 50కి తగ్గించడం, మైనింగ్ కంపెనీలు, అటవీశాఖ అధికారులు ట్రక్కుల పత్రాలను తనిఖీ చేయడం తప్పనిసరి చేయాలన్నారు. ఏదైనా ఉల్లంఘన జరిగితే కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. సీపీఐ నాయకుడు మహాశ గౌడ మాట్లాడుతూ ట్రక్కర్ల సంఘం టన్నుకు రూ.2 వసూలు చేస్తోందన్నారు. లారీ డ్రైవర్లకు ఎటువంటి అవగాహన కార్యక్రమం నిర్వహించడంలేదని అన్నారు. మనం అంతర్గతంగా లాబీయింగ్ చేయకూడదని, డబ్బు తీసుకొని జిందాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో చేతులు కలిపి పేదలకు మోసం చేయకూడదని ఆయన సూచించారు. కార్యక్రమంలో సండూర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ లారీ అసోసియేషన్ చాలాసార్లు భద్రతా సమావేశాలు నిర్వహించిందని తెలిపారు. రోడ్డు పక్కన మద్యం అమ్మ



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్ గోఖలే

కాలను నియంత్రించాలని ట్రక్కుల రాకపోకల సమయాన్ని ఆరు గంటలకు నిర్ణయించినప్పటి నుంచి ట్రక్కుల వేగం అనేక ప్రమాదాలకు కారణమైందన్నారు. ట్రక్కుల రాకపోకల సమయాన్ని 12గంటలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకుడు శ్రీశైల హాళదల్లి మాట్లాడుతూ ప్రమాదాలను నియంత్రించడానికి ట్రక్కులు తిరిగే రోడ్లపై ప్రతి కి.మీటరుకు సీసీటీవి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. గనులు భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రమాదాలను నియంత్రించడానికి లారీకి ఒక ట్రిప్పుకు మాత్రమే పర్మిట్ జారీ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించనున్నారు. దీనికి లారీ యజమానులు సహకరించాలన్నారు. రవాణా శాఖ అధికారి పాల్గొన్నారు.

కర్ణాటక రక్షణ వేదిక పదాధికారుల ఎన్నిక

బళ్లారి రూరల్, మే 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని రేణుక దర్శిని హోటల్‌లో కర్ణాటక రక్షణ వేదిక రాష్ట్ర సంచాలకుడు అర్దగిరి రామన్న, జిల్లా అధ్యక్షులు ఉలిగప్ప ఆధ్వర్యంలో నూతన పదాధికారులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వీరారెడ్డి, తిమ్మన్న, కార్యకర్తలు ఉమేష్, ఓబిరెడ్డి, జిల్లా సంచాలకులుగా రమేష్, ఎర్రగుడి, చంద్ర, కాన్వను సలహాదారులుగా రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులుగా వీరారెడ్డి, ఆనంద్, బళ్లారి నగర సంచాలకులుగా అసొండి సూరి, ఉమేష్ గౌడ, ఓబిరెడ్డి, చంద్రారెడ్డి, తిమ్మనగౌడ, చంద్రశేఖర్ పలువురికి పలు బాధ్యతలు రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు ఉలగప్ప ఆధ్వర్యంలో బాధ్యతలు అప్పగించి వారిని ఘనంగా సన్మానించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని సంఘ పదాధికారులు అన్నారు.



నూతన పదాధికారులను సన్మానిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె



బళ్లారిలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బళ్లారి గాంధీనగర్/సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): పౌర కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా పట్టణ, స్థానిక సంస్థల ఉద్యోగులు ధర్నా రెండో బుధవారం కొనసాగింది. విజయనగర జిల్లా కేంద్రమైన హొసపేట నగరంలో నీటి సరఫరా మినహా, నగరంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంది. మంగళవారం ఉదయం ప్రారంభమైన ధర్నా రాత్రి కూడా కొనసాగింది. బుధవారం సమ్మె కొనసాగడంతో 50శాతమంది పనికి రావాలని హొసపేట మున్సిపల్ కార్మికులతో చర్చించినా ఫలించలేదని కమిషనర్ చంద్రప్ప తెలిపారు. కార్మికుల ప్రధాన డిమాండ్లలో పౌరసేవకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం, కేజీఐడీ, జీపీఎస్ జ్యోతి, సంజీవిని తదితర వాటిని కార్మికులకు వర్తింప చేయాలని, ఔట్‌సోర్సు నీటి సరఫరా సిబ్బంది, లోడర్లు, క్లీనర్లు, సివిల్ సర్వెంట్లు, సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ప్రోగ్రామర్లు, ఇతర కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నేరుగా వేతనాలు చెల్లించే ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

కంప్లి: ఉద్యోగులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని, జ్యోతి సంజీవిని కేజీఐడీతోసహా ప్రభుత్వ ఉద్యోగులు పొందే అన్ని సౌకర్యాలు కల్పించాలని పౌర కార్మికుల సంఘం అధ్యక్షులు ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని పట్టణ పురసభ ఔట్‌సోర్స్ కాంట్రాక్టుల కింద పనిచేస్తున్న పౌర సేవకులకు ప్రత్యక్ష చెల్లింపు, దినసరి వేతన కార్మికుల సంక్షేమ అభివృద్ధి సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగులకు శాశ్వత ఉపాధి ఓపెన్ ఫండ్ నుంచి జీతం తదితర డిమాండ్లన్నీ నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. గౌరవాధ్యక్షులు నాగభూషణ, ఉపాధ్యక్షులు ఓబుళేష్, కార్యదర్శి రమేష్, బేలంకర్, ఉప కార్యదర్శి వెంకటేశం, పౌర కార్మికులు పాల్గొన్నారు.



కంప్లిలో ధర్నా చేస్తున్న పురసభ కార్మికులు

హొసూరు జోన్

అడవిలో ఏనుగు అస్తిపంజరం గుర్తింపు

హోసూరు, మే 28(ఆంధ్రజ్యోతి): అంచెట్టి రిజర్వు అభయారణ్యంలో ఏనుగు అస్తిపంజరం లభించింది. హోసూరు ఫారెస్టు రిజర్వు కన్సర్వేటర్ రాజమారియప్ప, అంచెట్టి ఫారెస్ట్ ఆఫీసర్ గోవిందన్, కెన్నెత్ ఆనా నేచర్ సొసైటీ, హోసూరు సంజీవ్‌కుమార్‌లతో కూడిన బృందం మంగళవారం పరిశీలించిన వేళ అస్తిపంజరాన్ని గుర్తించారు. అసిస్టెంట్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ జీ జయచంద్రన్ పోస్టుమార్టం నిర్వహించగా ఆడ ఏనుగుకు సుమారు 7 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఏనుగు శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఏనుగుది సహజమరణం ఉండవచ్చునని ప్రాథమికంగా నిర్ధారించారు.



ఏనుగు అస్తిపంజరం వద్ద పశువైద్య, అటవీ అధికారులు

కారును ఢీకొన్న లారీ

● భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు

హోసూరు, మే 28(ఆంధ్రజ్యోతి): హోసూరు-ధర్మపురి జాతీయ రహదారిపై వెళ్తున్న కారును, లారీ ఢీకొన్న ప్రమాదంలో భార్య కళ్లముందే భర్త మృతి చెందాడు. భార్యకు తీవ్ర గాయాలు కాగా హోసూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతోంది. మంగళవారం ఉదయం రాయకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం చోటు చేసుకుంది. బెంగళూరు దొడ్డమావళ్ళికి చెందిన సతీశ్ (47), భార్య సత్య (42)లు తమిళనాడు రాష్ట్రం దిండిక్కుల్ జిల్లా వేడ ముత్తూరులో బంధువుల శుభకార్యానికి కారులో బయల్దేరారు. కరకంబట్టి వద్ద లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు రక్షించి వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో సతీశ్ మృతిచెందాడు. సత్య చికితలు పొందుతోంది. రాయకోట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళ ఆత్మహత్య

హోసూరు, మే 28(ఆంధ్రజ్యోతి): అస్సోం రాష్ట్రానికి చెందిన నిబారోన్ భార్య తారాబోధి (22) ఆత్మహత్యకు పాల్పడింది. పెళ్ళయి ఒకటిన్నర సంవత్సరమైంది. ఇంకా పిల్లలు లేరు. కుటుంబ కలహాల కారణంగా ఈనెల 27న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. హోసూరు సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఏఎస్పీ అక్షయ్ అనిల్ వాఘరె ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

● డీహెచ్ఓ రమేశ్‌బాబు



రక్తదానంలో పాల్గొన్న మహిళకు పండ్లు, సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని డీహెచ్ఓ రమేష్‌బాబు అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లా పంచాయతీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రక్త భద్రతా టాస్క్‌ఫోర్స్ కమిటీ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దేవీనగర్ యోగా శిక్షణ కేంద్రం, పార్వతి నగర్, ఎస్పీ సర్కిల్ ఆటోడ్రైవర్స్ అసోసియేషన్ సహకారంతో బుధవారం దేవీనగర్‌లోని స్పందన బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డీహెచ్ఓ మాట్లాడుతూ జీవించి ఉండగానే ప్రతిఫలం ఆశించకుండా కుల, మతాల అడ్డంకులు లేకుండా తన శరీరాన్ని దానం చేయవచ్చన్నారు. అది మరో నలుగురి ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఒక వ్యక్తి నుంచి సేకరించిన రక్తాన్ని నాలుగు రూపాల్లో ప్రాణాలను కాపాడటానికి ఉపయోగించవచ్చన్నారు. మొత్తం రక్తం ప్లేట్‌లెట్లు, ప్లాస్మా, ప్యాక్డ్ కణాలు ఈరోజుల్లో రక్తం అవసరం చాలా ఉందని, 18ఏళ్ల పైబడిన ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయడం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో దేవీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సుధరాణి, బ్లడ్ బ్యాంక్ వైద్యుడు ప్రకాశ్, జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్పనవర్, యోగా కేంద్రం ప్రకాశ్, మహిళానాయకులు సుమారెడ్డి, రత్న, సిబ్బంది శ్వేత, రామకృష్ణ, కేశవ్, అంబరీశ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నరేగా కార్మికుల వేతనాలను విడుదల చేయాలి



నిరసన చేపడుతున్న ఏఐకేకేఎంఎస్ నాయకులు

బళ్లారి సిటీ,మే 28(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నరేగా వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐకేకేఎంఎస్ నాయకులు జిల్లా పంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి పని చేస్తున్నా ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు విడుదల చేయాలి,ప్రతి కుటుంబం కోరిన మేరకు 100రోజుల పని కల్పించాలన్నారు. ప్రతి వ్యక్తికి రూ.370 పూర్తి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నరేగా పథకం కింద అర్హత ఉన్న వారికి అన్ని సౌకర్యాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం నరేగా పనిచేసిన 5 నుంచి 10రోజుల్లోపు వేతనాలు ప్రభుత్వం చెల్లించేదన్నారు. కానీ ఈ ఏడాది ఇప్పటికీ విడుదల కాలేదన్నారు. ఈసారి తమ పంటలకు సరైన ధర లభించకపోవడంతో మిరప, వరి రైతులు చాలా నష్టపోయారన్నారు. వంటనూనె, గ్యాస్, పెట్రోల్, డీజిల్ తదితర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గురిల్లిరాజా, జిల్లా ఉపాధ్యక్షుడు బసన్న, కమిటీ సభ్యులు బసవరాజ్, కాశీంసాబ్, నాయకలు కోళూరు పంపా, పంపాపతి, ఈరన్న, మారెప్ప, పంపనగౌడ, రైతులు అంబరీశ్, హనుమంతమ్మ, రామలింగమ్మ, పద్మావతి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

జొన్న విత్తనాల పంపిణీ



జొన్న విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి బాలాజీ నాయక్

సిరుగుప్ప, మే 28 (ఆంధ్రజ్యోతి): జొన్న విత్తనాలను సబ్సిడీ ధరతో రైతులకు పట్టణ రైతు సంపర్క కేంద్రం అధికారి బాలాజీ నాయక్ పంపిణీ చేశారు. బుధవారం రైతు సంపర్క కేంద్రంలో సబ్సిడీ ధరతో రైతులకు జొన్నల విత్తనాలను అందించారు. రైతులు పహణి ఆధార్ కార్డుతో వస్తే విత్తనాలను అందిస్తామన్నారు.

కార్మికులకు ఇళ్లను నిర్మించి ఇవ్వండి



మేయర్ ముల్లంగి నందీశ్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

బళ్లారి సిటీ, మే 28(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ, ఇతర అసంఘటిత కార్మికులకు భూమి, ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేస్తూ మేయర్ ముల్లంగి నందీశ్‌కు బుధవారం భవన నిర్మాణ కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. కళ్యాణ కర్ణాటక భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ నిర్మాణరంగంలో అసంఘటిత కార్మికులతో పనిచేస్తున్న మాకు సొంత భూమి, ఇల్లు లేదని సంఘం కోర్టులో పిటిషన్ దాఖలు చేసిందన్నారు. 20 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివసిస్తున్నామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహనిర్మాణ పథకాల కింద లేదా కార్మిక శాఖ ద్వారా ఇంటి సౌకర్యం కల్పించాలని మేయర్‌ను కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

బళ్లారి గాంధీనగర్, మే 28(ఆంధ్రజ్యోతి): పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా బుధవారం పోలీసులు దాడిచేసి రూ.91వేలు విలువ చేసే 26.30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. హొసపేట పట్టణ శివారు ప్రాంతంలోని చిత్తవాడిగి పోలీసు స్టేషన్ పరిధిలో ఆటోలో తరలిస్తున్న రెండు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించారు. కొట్టూరు పట్టణంలోని పాళ్య రోడ్డులో ఎంఆర్‌పీఎల్ పెట్రోల్ బంకు సమీపంలో ఝునాన్ గూడ్స్ వాహనంలో తరలిస్తున్న 24.30 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మరొకరిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. మంగళవారం నగరంలోని జంబునాథ్ రోడ్డులో లారీలోఅక్రమంగా సాగిస్తున్న 331 క్వింటాళ్ల బియ్యాన్ని గ్రామీణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రెండో రోజూ కూడా పోలీసులు బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని జిల్లా ఆహార పౌరసరఫరా అధికారులకు అందజేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బియ్యాన్ని ఆహార పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు